సాక్షి గుంటూరు

సోమవారం, 27, మే, 2024



ఐశ్వర్య ప్రదాయినిగా బండ్లమ్మ

పిట్టలవానిపాలెం: చందోలులోని బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం అమ్మవారు ఐశ్వర్య ప్రదాయినిగా దర్శనమిచ్చారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది.



నూతన పుస్తకాల పరిచయం

నాదెండ్ల: నాదెండ్ల శాఖా గ్రంథాలయంలో ఆదివారం నూతన పుస్తకాల పరిచయం నిర్వహించారు. పలు కొత్త పుస్తకాలను విద్యార్థులకు అందించారు.

వైభవంగా సంకట హర చతుర్థి



భట్టిప్రోలు: మండలంలోని వేమవరంలో గల పాండురంగ స్వామి ఆలయంలో కొలువైన గణపతికి ఆదివారం సంకట హర చతుర్థి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



అమరావతి: ప్రసిద్ధ అమరేశ్వరాలయంలోని విఘ్నేశ్వర స్వామి ఉపాలయంలో ఆదివారం సంకట హరచతుర్థి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు శేషసాయిశర్మ స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలు, గరికెతో విశేషాలంకారం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి ఉండ్రాళ్లను సమర్పించారు.

ఆన్‌లైన్ మూల్యాంకనకు సిద్ధంగా ఉండాలి

జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారిణి నీలావతి దేవి

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల్ని ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేసేందుకు అధ్యాపకులు సిద్ధంగా ఉండాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారిణి ఎం.నీలావతి దేవి తెలిపారు. రావిపాడురోడ్డులోని ప్రైవేటు కళాశాలలో ఆదివారం జూనియర్ కళాశాలల అధ్యాపకులకు ఒకరోజు అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇంటర్ బోర్డు నుంచి ఆన్‌లైన్ ద్వారా మూల్యాంకనం చేసే విధానాన్ని అధికారులు వివరించారు. నీలావతి దేవి మాట్లాడుతూ తొలిసారిగా ఇంటర్ బోర్డు ప్రయోగాత్మకంగా ఆన్‌లైన్‌లో మూల్యాంకనాన్ని ప్రవేశపెడుతున్నదని తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంపై బోర్డు సూచనలు, సలహాలను వీడియోల రూపంలో అందజేస్తుందని చెప్పారు. అధ్యాపకులు ఇంటి నుంచి లేదా కళాశాలలోని కంప్యూటర్ ద్వారా చేయవచ్చని ఆమె సూచించారు. ఇంటర్‌నెట్ కేంద్రాల వద్ద నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ చేయరాదని, అటువంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధ్యాపకులంతా తమ టీచర్ యూఐడీ ద్వారా లాగిన్ కావాలని ఆమె తెలిపారు. జిల్లాలోని టీచర్ యూఐడీ అధ్యాపకులకు వెబ్‌సైట్ వివరాలను అందజేస్తామని ఆమె చెప్పారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

15 కేంద్రాల్లో జేఈఈ అడ్వాన్స్‌డ్



గుంటూరు ఎడ్యుకేషన్: ఐఐటీల్లో ప్రవేశం కోసం ఉద్దేశించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఆదివారం సజావుగా జరిగింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 15 కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలను నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా జరిగిన పరీక్షలకు దాదాపు నాలుగు వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. దూర ప్రాంతాల నుంచి విద్యార్థుల వెంట వచ్చిన తల్లిదండ్రులు దాదాపు నాలుగు గంటలపాటు రోడ్లపైనే గడిపారు. ఎండ వేడిమితో కొంత ఇబ్బందులు పడ్డారు. జనవరి, ఏప్రిల్‌లో రెండు సెషన్లలో జరిగిన జేఈఈ మెయిన్స్‌లో అర్హత పొందిన విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌కు హాజరయ్యారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరుగైన ర్యాంకు సాధించిన విద్యార్థులు ర్యాంకు ఆధారంగా ఐఐటీల్లో ప్రవేశం పొందేందుకు అర్హత సాధిస్తారు.

జాతీయ త్రో బాల్ పోటీలకు రాష్ట్ర జట్లు ఎంపిక



విజయవాడ స్పోర్ట్స్: జాతీయ సబ్ జూనియర్ త్రో బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర బాలుర, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు ఏపీ త్రో బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఈదా సులోచన తెలిపారు. బాలురు జట్టుకు బ్రెట్టి, సాయి సంతోష్, అహ్మద్‌బాషా, రామ్ చరణ్, సూర్య తేజ, సంతోష్, రాము, వరుణ్, రాకేష్, యశ్వంత్, రాజు, కిరణ్ కుమార్, అనిల్, బాలికల జట్టుకు లక్ష్మన్య, వర్షిణిరెడ్డి, లక్ష్మీదేవి, లాస్య, రేఖ, సహస్ర, జీవిక, నాగ అభిజ్ఞ, హేమ, గాయత్రి, సాయి తీర్థ, శరణ్య, సునేహ ఎంపికైనట్లు వివరించారు. పంజాబ్ రాష్ట్రంలోని పాటియాలలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరిగే జాతీయ పోటీల్లో జట్లు తలపడతాయని పేర్కొన్నారు.

సంస్కరణల్లో జైళ్లశాఖ



మాయాబజార్ సెంటర్‌లో జిల్లా కేంద్ర కారాగారం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్

- ఖైదీల్లో పరివర్తనే లక్ష్యంగా ముందుకెళుతున్న జైళ్ల శాఖ
- గుంటూరు, సత్తెనపల్లిలో కొనసాగుతున్న పెట్రోల్ బంక్‌లు
- వచ్చే నెల్లో గుంటూరు బ్రాడీపేటలో మరో బంకు ప్రారంభం



బ్రాడీపేటలోని జిల్లా కేంద్ర కారాగారం ఆవరణలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): క్షణికావేశంలో చేసిన తప్పిదాల వల్ల ఎందరో జైలుపాలై కుంగిపోతుంటారు. చేసిన నేరానికి పశ్చాత్తాప పడుతూ నాలుగు గోడల మధ్య బందీ అయిపోయామని కృశిస్తారు. అలాంటి వారిలో దాగున్న ప్రతిభను గుర్తించి.. ప్రోత్సహించి జనజీవన స్రవంతిలో భాగస్వాముల్ని చేసే దిశగా జైళ్ల శాఖ వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. నేరస్తుల్లో క్రమశిక్షణను పెంచి సత్ప్రవర్తన కలిగిన వారిని గుర్తించి నైపుణ్యాల పెంపునకు జైళ్ల శాఖ అధికారులు కృషిచేస్తున్నారు. ఎలాంటి స్కిల్స్ లేకపోయినా జైళ్ల శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు, విక్రయ శాలలు ప్రారంభించి పని కల్పిస్తున్నారు. ఖైదీలు సంపాదించిన సొమ్మును వారి కుటుంబ సభ్యులకు పంపి ఆర్థికంగా ఆసరాగా నిలుస్తున్నారు.

జూన్‌లో బ్రాడీపేటలో..

జైళ్లశాఖ గుంటూరు పట్టణంలోని మాయాబజార్ ఎదురుగా, పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి కారాగారానికి ఆనుకుని ఉన్న ప్రాంతంలో పెట్రోల్ బంకులు ఇప్పటికే నిర్వహిస్తోంది. వీటిల్లో ఖైదీలకు పని కల్పిస్తోంది. సత్ఫలితాలు రావడంతో గుంటూరు బ్రాడీపేటలోని జిల్లా కారాగారం వద్ద మరో పెట్రోల్ బంక్‌ను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈ బంకు నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. నాలుగు పంపులను ఏర్పాటు చేయనున్నారు. డీజిల్, పెట్రోల్ ఉత్పత్తుల్ని విక్రయించనున్నారు. వచ్చే నెల మొదటి వారంలో ప్రారంభించేందుకు జైళ్ల శాఖ సన్నాహాలు చేస్తోంది.

రెండు దఫాలుగా..

సత్తెనపల్లిలోని పెట్రోల్ బంక్‌లో సత్ప్రవర్తన కలిగిన ఖైదీలు పంప్ బాయ్‌లుగా పని చేస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగిశాక గుంటూరు మాయాబజార్ ఎదురున్న పెట్రోల్ బంక్‌లోనూ ఖైదీలను నియమించనున్నారు. గుంటూరు బ్రాడీపేటలో త్వరలో ప్రారంభం కానున్న బంక్‌నూ ఖైదీల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఇక్కడ రెండు విడతలుగా నాలుగు పంపుల వద్ద 16 మందికి విధులు కేటాయించనున్నారు. స్కిల్ లేబర్ కింద వేతనాన్ని చెల్లిస్తారు. వాళ్లకు భోజన సదుపాయాన్ని జిల్లా జైలు నుంచే పంపిస్తారు. ఈ క్రమంలో నెలకు వచ్చే జీతంలో సగానికి పైగా వారి కుటుంబ సభ్యులకు పంపించనున్నారు.

ఆదాయం పీడీబీకి

బంక్‌లపై వచ్చే ఆదాయాన్ని ప్రిజనర్ డవలప్‌మెంట్ బోర్డు(పీడీబీ)కి జమ చేస్తారు. ఈ మొత్తాన్ని జైళ్లలో మౌలిక వసతుల కల్పన, ఖైదీల సంక్షేమం కోసం ఖర్చుచేస్తారు. ఈ పెట్రోల్ బంకులతోపాటు ఇప్పటికే చిన్నపాటి పరిశ్రమల ద్వారానూ జైళ్లల్లో ఖైదీలకు అధికారులు ఉపాధి చూపుతున్నారు.

ఖైదీల్లో పరివర్తనే లక్ష్యం



వచ్చే నెల మొదటి వారంలో మరో పెట్రోల్ బంక్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే రెండు బంక్‌లను నిర్వహిస్తున్నాం. అవి బాగా నడుస్తున్నాయి. ఈ క్రమంలోనే మరో కొత్త బంక్‌ను గుంటూరు బ్రాడీపేటలో ప్రారంభించనున్నాం. ఖైదీల్లో పరివర్తన తీసుకువస్తున్నాం. వారికి ఉపాధి కల్పిస్తూ, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాం. ఖైదీలను ఉత్తమ పౌరులుగా మార్చి తిరిగి సమాజానికి అందించడమే మా ప్రధాన ఉద్దేశం.

– కె.రఘు,
గుంటూరు జిల్లా జైలు సూపరింటెండెంట్

నిరంతరం పర్యవేక్షణ

ఈ బంక్‌లను డెప్యూటీ జైలర్, ఒక కానిస్టేబుల్ నిరంతరం పర్యవేక్షిస్తారు. ఇక్కడికి వచ్చే వాహనదారులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా నాణ్యమైన డీజిల్, పెట్రోలు, పవర్ పెట్రోల్ అందించేందుకు కృషి చేస్తారు. ఈ బంకుల్లో పనిచేసిన వారికి జైల్లో శిక్ష కాలం ముగిసి, విడుదలైన తర్వాత కూడా జీవనోపాధి చూపిస్తున్నారు. వారు నివసించే గ్రామాలకు దగ్గర్లోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లలో పని చూపిస్తున్నారు. ఎటువంటి కల్తీ లేకుండా, నాణ్యత ప్రమాణాలతో కూడిన పెట్రోలు, డీజిల్‌ను జిల్లాలోని వాహన చోదకులకు అందించాలనేది జైళ్ల శాఖ ప్రధాన ఉద్దేశం. ఈ బంకులను లాభం కోసం కాకుండా వాహనచోదకులు, ఖైదీల సంక్షేమం కోసం నిర్వహిస్తున్నారు.

పోటెత్తిన ఇంద్రకీలాద్రి



ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలు

దుర్గమ్మ సర్వ దర్శనానికి రెండున్నర గంటలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానానికి ఆదివారం రికార్డు స్థాయిలో భక్తులు వచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, ఒడిశాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి, ఆది దంపతులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలు ఆర్జిత సేవలలో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున అమ్మవారి ప్రధాన ఆలయంలో నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చన, శాంతి కల్యాణం, చండీహోమంలో ఉభయదాతలు పాల్గొన్నారు. సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. ఘాట్ రోడ్డు, మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా భక్తులు ఆలయానికి చేరుకున్నారు. సర్వ దర్శనంతో పాటు రూ. 100, రూ.300, రూ. 500 టికెట్ క్యూలైన్ ద్వారా భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

రూ. 42.80 లక్షల ఆదాయం

ఆదివారం దుర్గమ్మ దర్శనానికి సుమారు 50 వేల మందికి పైగా భక్తులు వచ్చారు. ఒక్క రోజే రికార్డు స్థాయిలో రూ. 42. 80 లక్షల మేర ఆదాయం సమకూరిందని ఈవో కేఎస్ రామరావు పేర్కొన్నారు. రూ. 500 అంతరాలయ దర్శనం 2,372 టికెట్లు, రూ. 300 శీఘ్ర దర్శనం టికెట్లు 1,672, రూ. 100 ముఖ మండప దర్శనం టికెట్లు 7,654 టికెట్లను విక్రయించారు. రద్దీ నేపథ్యంలో మహా మండపం లిఫ్టును 5వ అంతస్తు వరకే అనుమతించారు. 5వ అంతస్తుకు చేరుకున్న భక్తులు క్యూలైన్ ద్వారా కొండపైకి చేరుకున్నారు. రద్దీ నేపథ్యంలో వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక సమయాన్ని దేవస్థానం కేటాయించింది. మరో వైపున రైల్వే స్టేషన్, బస్టాండ్, దుర్గాఘాట్ నుంచి దేవస్థానం నడిపే అన్ని బస్సు సర్వీసులలో భక్తులను ఉచితంగా అనుమతించారు. కొండ దిగువన వాహనాలను నిలుపుకుని దేవస్థాన బస్సులలో కొండపైకి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.

ఈవో తనిఖీలు..

భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గాలిగోపురం వద్ద స్కానింగ్ పాయింట్‌లో ఈవో కేఎస్ రామరావు పలుమార్లు తనిఖీలు నిర్వహించారు. రూ. 500 టికెట్ ఉన్న వారికే వీఐపీ దర్శనం క్యూలైన్‌లోకి అనుమతించాలని సిబ్బందిని ఆదేశించారు. మరో వైపున ఈఈలు కోటేశ్వరరావు, లింగం రమాదేవి, ఏఈవో ఎస్. రమేష్‌బాబు అంతరాలయం వద్ద క్యూలైన్లను పర్యవేక్షిస్తూ భక్తులు త్వరత్వరగా అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు తీసుకున్నారు.

కౌంటింగ్‌కు భారీ బందోబస్తు

- క్విక్ రియాక్షన్ బృందాలతో భద్రతా చర్యలు
- విజయోత్సవ ర్యాలీలకు అనుమతుల్లేవు
- నిరంతరం డ్రోన్లతో పర్యవేక్షణ
- భద్రతా చర్యలను డీజీపీకి వివరించిన బాపట్ల ఎస్పీ జిందాల్



బాపట్లటౌన్: బాపట్ల జిల్లాలో ఎన్నికల కౌంటింగ్‌కు భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆదివారం సాయంత్రం రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ రోజున చేపట్టే భద్రతా చర్యల గురించి డీజీపీకి వివరించారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటాయని, ముఖ్యంగా చీరాల బాపట్ల పట్టణాలపై ఎక్కువ నిఘా పెట్టామని పేర్కొన్నారు. కౌంటింగ్ రోజున అదనపు బలగాలతోపాటు బయట ప్రాంతాల నుంచి ప్రత్యేక అధికారులు వస్తున్నారని చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పక్కా ప్రణాళికతో కట్టుదిట్ట భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాల పరిధిలో ప్రత్యేక క్యూఆర్‌టీ(క్విక్ రియాక్షన్ టీం) బృందాలు తిరుగుతుంటాయని, పార్టీ కార్యాలయాలు, అభ్యర్థుల నివాసాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచుతున్నామని పేర్కొన్నారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతుల్లేవని, బాణసంచా కాల్చినా ఊరుకోబోమని స్పష్టం చేశారు. అల్లర్లకు పాల్పడేవారిని ముందే గుర్తించే చర్యలు చేపట్టామన్నారు. నిరంతరం డ్రోన్లతో పర్యవేక్షణ చేపట్టనున్నట్టు వివరించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

మంగళగిరికి చెందిన భార్యాభర్తలు మృతి



ఘటనా స్థలంలో మృతదేహాలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలిద్దరూ దుర్మరణం చెందారు. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో రాజీవ్‌గాంధీ పార్కు సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన షేక్ మున్నీర్ బాషా(59) ఎనికేపాడులోని వస్త్ర దుకాణం గోడౌన్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈయనకు భార్య జరీనా(55), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు ఇద్దరికీ వివాహం అయ్యింది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం అతను తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై పని మీద నగరానికి వచ్చాడు. రాత్రి 7.30 గంటల సమయంలో సీతమ్మ వారి పాదాలు వైపు నుంచి బస్టాండ్ వైపు వెళ్తున్నారు. రాజీవ్‌గాంధీ పార్కు సమీపానికి రాగానే కనకదుర్గ ఫ్లైఓవర్ మీదుగా బస్టాండ్ వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అతివేగంగా వెళ్తూ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలిద్దరూ కిందపడిపోయి తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. బస్సు అంతటితో ఆగకుండా ముందు వెళ్తున్న రెండు కార్లను, ఒక టాటా మ్యాజిక్ ఆటోను ఢీకొట్టింది. ఆ వాహనాల్లో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత బస్సు బస్టాండ్ ఎదురుగా ఉన్న డివైడర్‌ను ఢీకొని ఆగిపోయింది. వెంటనే బస్సు డ్రైవర్ దిగి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మున్నీర్‌బాషా, జరీనా మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రామాల్లో కొనసాగుతున్న పోలీస్ పికెట్లు

ముప్పాళ్ల : మండలంలోని మాదల, తొండపి గ్రామాల్లో పోలీస్ పికెట్లు కొనసాగుతున్నట్లు ఎస్‌ఐ పి. హజరతయ్య ఆదివారం తెలిపారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత కూడా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనే వరకు పికెట్లు కొనసాగుతాయని చెప్పారు.

68 మంది అరెస్ట్

ఎన్నికల నేపథ్యంలో జరిగిన అల్లర్లపై 11 కేసులకుగాను 68 మందిని అరెస్ట్ చేశామని, మరో 50 మంది పరారీలో ఉన్నారని ఎస్‌ఐ పి. హజరతయ్య తెలిపారు. వీరిలో 10 మందిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. మొత్తం 190 మందిని బైండోవర్ చేశామన్నారు. తొండపిలో జరిగిన ఘర్షణల్లో ఎనిమిది మందిపై రౌడీషీట్ ఓపెన్ తెరిచామన్నారు. మాదలలో పెట్రోల్ బాంబుల పట్టివేత కేసులో 11 మందికి గాను ఇద్దరిని అరెస్ట్ చేశామని తెలిపారు. మిగిలిన వారిని కూడా త్వరలో అరెస్ట్ చేస్తామని చెప్పారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

విత్తన ఎంపికే కీలకం

- కొనుగోలులో అప్రమత్తత అవసరం
- లైసెన్స్ కలిగిన డీలరు వద్ద కొనుగోలు చేయడం ఉత్తమం
- నాణ్యమైన విత్తనాలు, జాగ్రత్తలతో అధిక దిగుబడులు
- జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు సూచనలు

ఫిర్యాదులుంటే ఫోన్ చేయాల్సిన నంబర్

8331056901



పత్తి విత్తనాలు

కొరిటిపాడు(గుంటూరు): విత్తనం మంచిదైతే పంట బాగా పెరుగుతుంది.. దిగుబడులు మెరుగ్గా ఉంటాయి. కొంతమంది రైతులు విత్తనం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోరు. దొరికింది కదాఅని ఏదో ఒకటి కొని విత్తుకుని నష్టపోతుంటారు. వ్యవసాయంలో రాణించడానికి, అధిక దిగుబడులు పొందడానికి నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ఎంతో ముఖ్యం. రైతులు సరైన విత్తనం ఎంపిక చేసుకోకుండా ఎన్ని సస్యరక్షణ చర్యలు చేపట్టినా ఉపయోగం ఉండదు. విత్తన ఎంపిక, కొనుగోలులో కొన్ని మెళకువలను తప్పనిసరిగా పాటించాలి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతోంది. వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయి. రైతులు వ్యవసాయ పనులకు సిద్ధం అవుతున్నారు. ఈ క్రమంలో విత్తనాల కొనుగోలు, ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) నున్నా వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. మంచి దిగుబడి విత్తనం ఎంపికపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో విత్తనాల ఎంపిక, కొనుగోలులో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవేంటో చూద్దాం.

- ధ్రువీకరించిన మేలు రకం విత్తనాలను ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థల నుంచి లేదా పరిశోధన కేంద్రాలు, వ్యవసాయ శాఖ గుర్తించిన డీలర్ల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి.
- విత్తనాలు కొనేప్పుడు లాటు నంబర్, తేదీ, రకం వివరాలతో సంతకం చేసిన బిల్లును రైతులు విధిగా పొందాలి. ఆ బిల్లును పంట కోత పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచాలి.
- విత్తన సంచిపై వేసిన గడువు తేదీని గమనించాలి. ఆ తేదీలోగా విత్తనాలను ఉపయోగించాలి. గడువు తేదీ ముగిసిన విత్తనాలు కొనొద్దు.
- విత్తన సంచిపై సూచించినట్టు మొలక శాతం, నికర తూకం పరీక్షించి ఉపయోగించాలి. పంట కాలం పూర్తయ్యే వరకు విత్తన సంచిని జాగ్రత్త చేసుకోవడం అవసరం.
- సంకర విత్తనాన్ని(హైబ్రిడ్) ప్రతి పంటకు విధిగా మార్చుకోవాలి. హైబ్రిడ్ విత్తనాలు ఒక పంటకు మాత్రమే ఉపయోగపడతాయి.
- పత్తిలో నిషేధిత విత్తనాలను వాడవద్దు. అనుమతిలేని, పర్యావరణంకు హాని కలిగించే హెచ్‌టీ పత్తి విత్తనాలను వాడరాదు.
- మేలురకపు అధిక దిగుబడినిచ్చే వంగడాలను విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా కొని ఆ పంట ద్వారా అభివృద్ధి చేసిన విత్తనాలను రెండు, మూడేళ్ల వరకు వాడుకోవచ్చు.
- విత్తనం సేకరించేటప్పుడు తెగులు సోకని పంట నుంచి నాణ్యమైన దృఢమైన విత్తనాన్ని సేకరించి భద్రపరుచుకోవాలి.
- రైతు సేకరించే విత్తనాలు బాగా మొలకెత్తే శక్తి కలిగి, రంగు, పరిమాణం, ఆకారంలో విత్తనాలన్నీ ఒకే మాదిరిగా ఉండాలి.
- కేళీలు, ఇతర కలుపు మొక్కల విత్తనాలు లేకుండా చూసుకోవాలి.
- తాలు గింజలు, పూర్తిగా తయారు కాని గింజలను తొలగించడానికి ముందు రెండు శాతం ఉప్పు ద్రావణంలో పోసి పైకి తేలిన విత్తనాన్ని వేరుచేసి మంచి నీటితో కడిగి ఆరబెట్టి ఉపయోగించాలి.
- బాగా ముదిరిన గింజలనే ఎంపిక చేసుకుని, విత్తనాలుగా వాడాలి. అనధికాకంగా విక్రయించే విత్తనాలను కొనుగోలు చేయరాదు. లూజు విత్తనాలు వాడటం మంచిది కాదు. అనుమతి లేకుండా విత్తనాలు అమ్మేవారిపై సమీపంలోని వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.

కౌంటింగ్ ఏజెంట్.. అర్జెంట్

- నెలాఖరులోపు ఏజెంట్ల వివరాలు అందించాలని ఎన్నికల కమిషన్ ఆదేశం
- నియామకానికి ప్రధాన పార్టీల కసరత్తు
- నేర చరిత్ర లేని వారికి మాత్రమే ఎన్నికల సంఘం అనుమతి
- వివరాలు కోరుతూ అభ్యర్థులకు అధికారుల ఆదేశం

సత్తెనపల్లి: ఎన్నికల రణరంగంలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం తేలేందుకు వారం రోజులే గడువు మిగిలింది. దీంతో ఓట్ల లెక్కింపు రోజు చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రధాన రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లను నియమించుకునేందుకు కసరత్తు చేపట్టాయి. ఎప్పటికప్పుడు కౌంటింగ్ సరళిని గమనించేందుకు ముఖ్య నాయకులకు అభ్యర్థులు బాధ్యతలు అప్పగిస్తున్నారు.

బూత్ స్థాయి నేతలే కీలకం

ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను దగ్గరుండి చూసుకోకపోతే నష్టపోతారంటూ పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులకు ఆయా పార్టీల అధిష్టానాల నుంచి ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో పోలింగ్ రోజున తమ పార్టీకి ఓటు వేసేలా చేయడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన బూత్ స్థాయి నేతలతో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు అంతర్గత సమావేశాలు నిర్వహిస్తూ, ఏజెంట్ల ఎంపికలో బిజీగా ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో కూడా బూత్ స్థాయి నేతలే ప్రధాన రాజకీయ పక్షాల అభ్యర్థులకు అన్నీ తామై వ్యవహరించారు. ఓట్ల లెక్కింపు సమయంలో కూడా గోల్‌మాల్ జరగకుండా చూసేందుకు వారినే ఏజెంట్లుగా కూడా నియమించుకుంటున్నారు. జూన్ 4న పల్నాడు జిల్లాకు సంబంధించి నరసరావుపేట సమీపంలోని కాకాని జేఎన్‌టీయుకేలో నరసరావుపేట పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుంది. పోటీలో ఉన్న అభ్యర్థులు తమ ఏజెంట్ల వివరాలు అందజేయాలని ఎన్నికల అధికారులు సూచించడంతో జాబితా సిద్ధం చేస్తున్నారు. టేబుల్‌కు ఒకరు చొప్పున నియమించుకోవచ్చు. అభ్యర్థితో పాటు ఏడు నియోజకవర్గాల్లో జరిగే పార్లమెంట్ ఓట్ల కౌంటింగ్‌ను పరిశీలించేందుకు ఒక ముఖ్య ఏజెంట్ కూడా ఏర్పాటు చేసుకోవచ్చు.

ఎంపిక ప్రక్రియ ఇలా..

గతంలో జరిగిన ఎన్నికల్లో ఏజెంట్లుగా పని చేసిన వారినే ప్రధాన రాజకీయ పక్షాలు నియమించుకుంటున్నాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 4వ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఏజెంట్ గుర్తింపు కార్డు ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతిస్తారు. అయితే వివరాలు ఫారం-18లో సమర్పించాల్సి ఉంటుంది. పార్లమెంట్, అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు సంబంధించి రాజకీయ పార్టీలు కౌంటింగ్ ఏజెంట్ల వివరాలు ఫారం-18లో రెండు ఇవ్వాలని అధికారులు ఆదేశించారు. వాటి ఆధారంగా పాసులు జారీ చేస్తారు. ఒక సెట్‌ను పోలీసు విభాగానికి పంపి వారి నేర చరిత్ర, పూర్తి వివరాలు పరిశీలిస్తారు. ఎలాంటి కేసులు లేని వారిని అనుమతిస్తారు. దీంతో ప్రధాని రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా నేరచరిత్ర లేని వారినే ఏజెంట్లుగా నియమించుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ నెల 31లోపు అభ్యర్థులంతా ఏజెంట్ల వివరాలను అందించాలని ఇప్పటికే రిటర్నింగ్ అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాల్లో దిశానిర్దేశం చేశారు.

క్లుప్తంగా

50 కిలోల గంజాయి పట్టివేత



మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కాజ టోల్‌గేటు వద్ద సెబ్ పోలీసులు 50 కిలోల గంజాయిని ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ పి.ప్రసన్న లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం విశాఖపట్నం నుంచి గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు కాజ టోల్‌గేటు వద్ద తనిఖీలు నిర్వహించగా, కారులో తరలిస్తున్న 50 కిలోల గంజాయి తరలిస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని, గంజాయిని, కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెట్రోల్ బాంబు కేసులో ఇద్దరు అరెస్టు

సత్తెనపల్లి రూరల్ సర్కిల్ సీఐ ఎం.రాంబాబు

సత్తెనపల్లి : మండల పరిధిలోని నకరికల్లు, రాజుపాలెం, ముప్పాళ్ల, సత్తెనపల్లి రూరల్ మండలంలోని 30 మందిపై రౌడీషీట్స్ ఓపెన్ చేశామని సత్తెనపల్లి రూరల్ సర్కిల్ సీఐ ఎం.రాంబాబు ఆదివారం తెలిపారు. మాదలలో పెట్రోల్ బాంబ్ కేసులో ఇద్దరిని అరెస్టు చేశామని చెప్పారు. ఎన్నికల ముందు బైండోవర్ కేసు నమోదు చేసిన వారిలో 44 మంది మరలా గొడవల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. వారిలో 35 మందికి ముప్పాళ్ల తహసీల్దార్ శ్శ బాండ్ అమౌంటు గవర్నమెంట్‌కి కట్టమని నోటీసులు ఇచ్చారని వివరించారు. అయితే ఇందులో 16 మంది మాత్రమే హాజరయ్యారని తెలిపారు. గుల్లపల్లిలో ఈవీఎం పగలగొట్టిన కేసులో ఇప్పటి వరకు 25 మందిని అరెస్టు చేశామని చెప్పారు. ఇంకా కొంతమంది తప్పించుకుని తిరుగుతున్నారని, వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని సీఐ తెలియజేశారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచి, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. చట్టాన్ని అతిక్రమించి ప్రవర్తిస్తే ఎంతటి వారినైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఆధారాలు లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని తెలిపారు. కౌంటింగ్ సమయంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని 8 గేదెలు, దూడ మృతి

- పశువుల యజమానికి, ప్రయాణికులకు తప్పిన పెను ప్రమాదం
- 1000 మీటర్లు ముందుకు వెళ్లి ఆగిన బస్సు
- తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరులో ఘటన



మృతిచెందిన గేదెలు

తాడేపల్లిరూరల్: ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో 8 చూడి గేదెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో లేగ దూడ మృతిచెందిన ఘటన గుంటూరు జిల్లా తాడేపల్లి రూరల్‌పరిధిలో జరిగింది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. చిర్రావూరు గ్రామానికి చెందిన వీరిశెట్టి బాజీ పశువుల పెంపకంతో తమ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇదే గ్రామంలో ఉండే బాజీ చెల్లెలు పసుపులేటి నాగులు కూడా రెండు గేదెలను మేపుకొంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటూ కొడుకును చదివించుకుంటోంది. నాగులు కుమారుడైన వెంకటసాయి తేజ కాలేజీకి సెలవులు కావడంతో మేనమామ వీరిశెట్టి బాజీవి, మరియు వారి సొంతవైన మొత్తం 15 గేదెలను మేపేందుకు తీసుకువెళ్లాడు. అన్ని గేదెలు చూడి వి కావడంతో రాత్రి 7 గంటల వరకు మేపి గుండిమెడ శివారు నుంచి చిర్రావూరుకు తోలుకువస్తుండగా చిర్రావూరు గ్రామ శివారులో అతివేగంగా వచ్చిన గవర్నర్‌పేట డిపో–1కు చెందిన ఆర్టీసీ బస్సు 15 గేదెలను ఢీకొంది. ఈ సమయంలో 8 గేదెలు, దూడ అక్కడికక్కడే మృతి చెందాయి. పశువులు కాయడానికి వెళ్లిన డిగ్రీ విద్యార్థి వెంకటసాయి తేజ ప్రాణాలు రక్షించుకునేందుకు పక్కనే వున్న పంట పొలాల్లోకి దూకాడు.

అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు...

చిర్రావూరు గ్రామ శివారులో మలుపుతిరిగిన తరువాత బస్సు డ్రైవర్ వేగాన్ని పెంచి గ్రామ శివారులో ముందు ఒక కారును ఢీకొట్టబోయాడు. అనంతరం 250 మీటర్ల దూరంలో బస్సుకు కుడివైపు నడుస్తున్న పాడిపశువులను ఢీకొట్టాడు. అక్కడినుంచి 1000 మీటర్లు వెళ్లి బస్సును ఆపి డ్రైవర్ పారిపోబోగా.. అటునుంచి వస్తున్న కొంత మంది డ్రైవర్‌ను పట్టుకుని చిర్రావూరు గ్రామస్తులకు అప్పగించారు.



ప్రాణాలతో బయటపడ్డ వెంకటసాయి తేజ

రూ.10 లక్షలు నష్టం....

మృతిచెందిన గేదెలలో 7 గేదెలు వీరిశెట్టి బాజీవి కాగా, ఒక గేదె ఒక దూడ నాగులువి. వీటి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని, గేదెలన్నీ చూడిమీద ఉన్నాయని, మరో రెండు మూడు రోజుల్లో మూడు గేదెలు ఈనతాయని బాజీ బోరున విలపిస్తూ తెలిపాడు. మరో ఆరు గేదెలకు కాళ్లు, కొమ్ములు విరిగిపోయాయని, అందులో రెండు గేదెలు చనిపోతాయని, ఆ గేదెలు కూడా చనిపోతే మరో రూ.3 లక్షలు నష్టం వాటిల్లుతోందని బాజీ ఆవేదన వ్యక్తం చేశాడు.

ప్రయాణికులకు తప్పిన పెను ప్రమాదం..

నూతక్కి నుంచి విజయవాడ బస్టాండ్‌కు వెళుతున్న గవర్నర్‌పేట డిపో బస్సులో ప్రమాదం జరిగే సమయంలో 15 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు అతివేగంతో వచ్చి గేదెలను ఢీకొన్న సమయంలో మూడు అడుగుల వరకు పైకి లేచిందని ప్రయాణికులు తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా పంటకాలువల బోదెలు ఉన్నాయి. బస్సు అదుపుతప్పి ఆ బోదెలలో పడి ఉంటే పెను ప్రమాదం జరిగేదని, గేదెలు మృతి చెందడంతో పాటు ప్రాణనష్టం కూడా వాటిల్లేదని గ్రామస్తులు తెలిపారు.

- తాడేపల్లి ఎస్‌ఐ రమేష్, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, చిర్రావూరులో ఉన్నటువంటి ఆర్టీసీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. జరిగిన సంఘటనపై గేదెల యజమాని వీరిశెట్టి బాజీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి కార్మికుడు దుర్మరణం

ఫిరంగిపురం: విద్యుత్ తీగలు మార్చుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి కిందపడి ఝార్ఖండ్‌కు చెందిన కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని వేములూరిపాడులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొద్దిరోజులుగా రోడ్డుకు ఇరువైపులా నూతనంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి తీగలు లాగుతున్నారు. ఈ క్రమంలో ఓ ప్రైవేటు సంస్థకు చెందిన కాంట్రాక్టర్ ద్వారా పనులకు ఝార్ఖండ్‌కు చెందిన కార్మికులు వచ్చి పనిచేస్తున్నారు. ఈ క్రమంలో వేములూరిపాడు గ్రామంలోని రామాలయం సెంటర్లో ఝార్ఖండ్ రాష్ట్రం, వెస్ట్‌సింగ్‌బాయి జిల్లా హార్దగా మారియాకు చెందిన ఓవన్‌సింక్(37) విద్యుత్ తీగలు లాగి మార్చుతుండగా(ఇన్‌వర్టర్ సప్‌లై) విద్యుత్ షాక్ తగలడంతో పైనుంచి కిందకు పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయాలు కాగా అక్కడికక్కడనే అతడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వీరనారాయణ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ వీరనారాయణ

దుగ్గిరాలలో 17.8 మి.మీ వర్షం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 17.8 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 0.8 మి.మీ వర్షం పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. తాడేపల్లి మండలంలో 15.6 మి.మీ., కొల్లిపర 14.6, తెనాలి 11.8, మంగళగిరి 9.4, ప్రత్తిపాడు 5.2, పెదకాకాని 3, మేడికొండూరు 2.2, గుంటూరు తూర్పు 1.2, గుంటూరు పశ్చిమలో 1 మి.మీ చొప్పున వర్షం పడింది.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు

మార్టూరు: ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు మార్టూరులో సోమవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. శ్రీకారం స్వచ్ఛంద సేవా సంస్థ.. మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా 27, 28, 29 తేదీల్లో జరగనున్నాయి. మొత్తం 11 నాటికలను ఎంపిక చేసినట్లు ప్రముఖ రచయిత, దర్శకుడు కందిమళ్ల సాంబశివరావు తెలిపారు.

ప్రదర్శనలు ఇవే..

మొదటి రోజు సోమవారం రాత్రి 8: 30 గంటలకు శ్రీ అమృత లహరి ఆర్ట్స్ విజయవాడవారి 'నాన్నా! నేను వచ్చేస్తా' నాటిక, రాత్రి 10లకు తెలుగు కళాసమితి విశాఖవారి 'నిశ్శబ్దమా... నీ ఖరీదెంత?' నాటిక, రాత్రి 11 గంటలకు కళానికేతన్ వీరన్నపాలెం వారి 'రాజుగారి గోచి' నాటికలు ప్రదర్శించనున్నారు. 28వ తేదీ రాత్రి 8.30లకు శ్రీకారం.. రోటరీ కళాపరిషత్ మార్టూరు వారి ' రైతు భారతం' నాటిక, రాత్రి 10.30లకు రసఝురి పొన్నూరి నాటిక 'కాపలా', 11.30 గంటలకు కళాంజలి హైదరాబాద్ వారి' రైతే రాజు', 12.30లకు మైత్రి కళానిలయం విజయవాడ వారి 'బంధం' నాటికను ప్రదర్శించనున్నారు. చివరి రోజు రాత్రి 8.30లకు అభినయ గుంటూరి వారి 'ఇంద్రప్రస్థం' 10.30 గంటలకు చైతన్య కళాభారతి కరీంనగర్ వారి 'చీకటి పువ్వు నాటిక', 11.30 లకు శ్రీ సాయి ఆర్ట్స్ పాలకలూరు వారి 'కౌసల్యా సుప్రజా రామ', 12. 30 గంటలకు వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారి 'రాత' నాటికలు ప్రదర్శించనున్నారు. అనంతరం విజేతలకు రోటరీ జిల్లా పీస్ కమిటీ చైర్మన్ కె.విక్రమ్ రెడ్డి, శ్రీమతి వైజయంతి విక్రమ్ రెడ్డిల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

గ్రానైట్ రాళ్ల లారీ సీజ్

యడ్లపాడు: పరిమితికి మించి గ్రానైట్ రాళ్లను అక్రమంగా తరలించే వాహనాన్ని మైనింగ్ విజిలెన్స్ అధికారులు శనివారం రాత్రి పట్టుకున్నారు. మైనింగ్ విజిలెన్స్ ఏడీ శివాజీ తెలిపిన వివరాల ప్రకారం.. ఫిరంగిపురంలోని సాయిరామ్ స్టోన్ క్రషర్‌కు చెందిన గ్రానైట్ ముడిరాయి లారీ వేబిల్లు పత్రంలో నమోదు చేసిన పరిమితికి మించిన లోడుతో ప్రయాణిస్తోంది. ఈ క్రమంలో యడ్లపాడు పోలీస్‌స్టేషన్ సమీపంలో విజిలెన్స్ అధికారి లారీని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఆయన తెలిపారు.



మైనింగ్ అధికారులు స్వాధీనం చేసుకున్న లారీ

అనారోగ్యం, అప్పులతో వ్యక్తి ఆత్మహత్య

సత్తెనపల్లి: అనారోగ్యంతో పాటు అప్పులతో మానసికంగా కుంగిపోయి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలో శనివారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 11వ వార్డు రఘురామ్‌నగర్‌కు చెందిన భోగాది బసవేశ్వరరావు (54) గతంలో క్రోసూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడి గా పని చేసేవాడు. అనారోగ్య కారణంగా గత కొంత కాలం నుంచి పని చేయడం లేదు. అప్పులు కూడా ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు పట్టణంలోని ఏరియా వైద్యశాలకు తరలించగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఈశ్వరి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ ఎం. సంధ్యారాణి కేసు నమోదు చేశారు.

ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించాలి

కొల్లూరు: కృష్ణా నది నుంచి ఇసుక అక్రమ రవాణాను నిలువరించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని రేపల్లె ఆర్డీఓ హేలా షారోన్ ఆదేశించారు. కొల్లూరు మండలం జువ్వలపాలెం, గాజుల్లంక, పెదలంక, పెసర్లంక అరవింద వారధి ప్రాంతాలలో కృష్ణా నదిని మైనింగ్, రెవెన్యూ, పోలీసు, సెబ్ అధికారులతో కలసి ఆమె శనివారం పరిశీలించారు. నదిలోకి దిగడానికి అనుకూలంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ర్యాంపుల ద్వారా ట్రాక్టర్లు, ఇతర వాహనాలు నదిలోకి ప్రవేశించకుండా ఏర్పాటు చేసిన గండ్లను ఆమె పరిశీలించారు. పెసర్లంక అరవింద వారధి వద్ద గండి ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని విడిచి ట్రాక్టర్లు రాత్రి సమయాలలో ఇతర మార్గాల ద్వారా నదిలోకి ప్రవేశిస్తున్నాయని పలువురు ఆమె దృష్టికి తీసుకురావడంతో తక్షణం ఏ ఒక్క వాహనం నదిలోకి దిగడానికి వీలు లేకుండా పోల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఇంట్లో 18 సవర్ల బంగారం చోరీ

మూల్పూరు(వేమూరు): అమర్తలూరు మండలంలోని మూల్పూరులో శనివారం సాయంత్రం దొంగలు ఓ ఇంట్లోకి ప్రవేశించి 18 సవర్ల బంగారం ఎత్తుకుపోయారు. ఇంటి యజమాని అవుల శ్రీనివాసరావు పని ఉండి సాయంత్రం ఆరు గంటలకు బయటకు వెళ్లారు. భార్య గుడికి వెళ్లింది. ఈ సమయంలో దొంగలు ఇంటిలోకి ప్రవేశించి బీరువాలలోని 18 సవర్ల బంగారు ఆభరణాలు ఎత్తుకుపోయారు. అవుల శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు చుండూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ నవీన్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఆదివారం డాగ్ స్క్వాడ్‌తో సంఘట స్థలానికి చేరుకున్నారు. దొంగల్ని పట్టుకునేందుకు ప్రత్యేకంగా పోలీసు బృందాల్ని కేటాయించినట్లు తెలిపారు.



తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్

ఏజెంట్లపై దాడి కేసులో 12 మంది అరెస్టు

రెంటచింతల: మండలంలోని రెంటాలలో ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఏజెంట్లపై దాడి కేసులో 12మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు ఆదివారం తెలిపారు. దాడిలో గాయపడిన చేరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, చేరెడ్డి మంజుల, గొంటు నాగమల్లేశ్వరరెడ్డి, చేరెడ్డి రఘురామిరెడ్డిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు చెప్పారు. నిందితులైన 12 మందిని గురజాల జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరు పెట్టగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కార్డన్ సెర్చ్‌లో 12 బైకుల సీజ్

అమరావతి: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరిగిన హింసాత్మక సంఘటనల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తారనే అనుమానం ఉన్న వారు, నేరప్రవృత్తి కలిగిన వారిపై ముందస్తు జాగ్రత్తగా బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు సీఐ ఎ.వి. బ్రహ్మం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని నరుకుళ్లపాడు, దిడుగు, ఉంగుటూరు, లింగాపురం గ్రామాల్లో ఉన్నతా ధికారుల సూచనల మేరకు పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మిగిలిన అన్ని గ్రామాల పైనా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఆదివారం నాటికి 103 కేసుల్లో 342 మందిని బైండోవర్ చేశామని తెలిపారు. ఆదివారం లింగాపురం నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో 12 ద్విచక్ర వాహనాల్ని సీజ్ చేశామని చెప్పారు. ఉంగుటూరు గ్రామస్తులతో నిర్వహించిన శాంతి సమావేశంలో ఓట్ల లెక్కింపు రోజున ప్రశాంతంగా ఉండాలని సూచించామన్నారు. పెట్రోలు బంకుల్లో బాటిళ్లలో పెట్రోలు పోయడం నిషేధించామని తెలిపారు. దీనికి విరుద్ధంగా వ్యవహరించే యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



లింగాపురంలో కార్డన్ సెర్చ్ చేస్తున్న పోలీసులు

పెదకూరపాడులో...

మండలంలోని 20 గ్రామాల్లో నామినేషన్ నాడు, పోలింగ్ రోజున గొడవలకు దిగిన వారితో పాటు నేర ప్రవృత్తి కలిగిన 330 మందిని బైండోవర్ చేశామని ఎస్‌ఐ వెంకటరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

బలసాని గెలుపుకోసం పాదయాత్ర

గుంటూరు రూరల్: ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ ఘన విజయాన్ని సాధించాలని, రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ నాగేశ్వరరావు పాదయాత్ర చేపట్టారు. ఆదివారం మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలోని ఒంకార్ సెంటర్‌నుంచి పాదయాత్రగా విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని మొక్కుకుంటున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణాల్లోని పేదలు సంతోషంగా జీవించాలంటే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని కోరుకుంటున్నానని తెలిపారు. వెంగళాయపాలెం నుంచి పాదయాత్రగా గుంటూరు, మంగళగిరి మీదుగా విజయవాడకు చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు బత్తుల వెంకటరావు, పేరేచర్ల శివశంకర్, నాగేశ్వరరావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



పాదయాత్రగా వెళుతున్న వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ నాగేశ్వరరావు

తురకపాలెంలో కార్డన్ సెర్చ్

గుంటూరు రూరల్: సార్వత్రిక ఎన్నికలు ముగిసి కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతున్నందున గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా, శాంతి భద్రతలను కాపాడే క్రమంలో నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు తమ పరిధిలోని పలు గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. ఆదివారం మండలంలోని తురకపాలెంలో కార్డన్ సెర్చ్ నిర్వహించి, గ్రామంలోని ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కార్డన్ సెర్చ్‌ను ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నిర్వహిస్తున్నామని సౌత్‌జోన్ డీఎస్పీ మహబూబ్‌బాషా, సీఐ నరేష్‌కుమార్‌లు తెలిపారు. రౌడీషీటర్ల కదలికలను గుర్తించి ఎల్లప్పుడూ వారిపై నిఘాను కొనసాగిస్తున్నామన్నారు. ప్రజాశాంతికి భంగం కలిగించే కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలలో భాగంగా పత్రాలు సక్రమంగా లేని పలు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



తురకపాలెంలో స్వాధీనం చేసుకున్న బైక్‌లతో సౌత్ జోన్ డీఎస్పీ మహబూబ్‌బాషా, సీఐ నరేష్‌కుమార్

దుర్గమ్మ సన్నిధిలో సంకటహర చతుర్థి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద సంకటహర చతుర్థి నిర్వహించారు. యాగశాలలో తొలుత ఆలయ అర్చకులు గణపతి స్వామికి పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో ఆలయ వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణమూర్తి ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకులు, వేద పండితులు పూజా కార్యక్రమాలను నిర్వహించగా ఆలయ ఈవో కేఎస్ రామరావు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

లోక సంరక్షణార్థం సూర్యోపాసన సేవ

లోక సంరక్షణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. సేవలో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

'మనసార' వాస్తు శాస్త్ర గ్రంథావిష్కరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): శిల్ప కళాభారతి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తాడేపల్లిలోని స్టేట్ ఇన్నోవేషన్ అండ్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ ఆయోగ్ (సిత) కార్యాలయంలో 25, 26 తేదీల్లో శిల్ప ఆగమ వాస్తు సదస్సు జరిగింది. ఇందులో ఏపీతోపాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన శిల్ప – ఆగమ–వాస్తు పండితులు హాజరై ఆయా అంశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా శిల్ప కళాభారతి సంచాలకులు కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య ప్రచురించిన 'మనసార' వాస్తు శాస్త్ర గ్రంథాన్ని ఏపీ దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ శ్రీరాము సత్యనారాయణ, శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.ఎస్. రామరావు ఆవిష్కరించారు. అనంతరం కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ భారతీయ వాస్తు శిల్పం, రూపకల్పనపై ఉన్న ప్రాచీన సంస్కృత గ్రంథాన్ని తెలుగులోకి అనువదించిన డాక్టర్ పెదపాటి నాగేశ్వరరావు అభినందనీయులన్నారు. ఆధ్యాత్మిక కళల్లో హస్త కళాకారుడు/కళాకారిణి తమతమ సంప్రదాయ రీతుల్లో ఆధ్యాత్మికత, పవిత్రతను వ్యక్తపరుస్తూ కళాకృతులను రూపొందిస్తారని పేర్కొన్నారు. రెండు రోజులపాటు శిల్ప కళాభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో శిల్ప, ఆగమ, వాస్తు అంశాలపై వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పండితులు ఇచ్చిన సూచనలు, సలహాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి ధ్వన్యుకరణ చక్రవర్తి భవిరి రవి సమన్వయకర్తగా వ్యవహించారు.



మనసార వాస్తు శాస్త్ర గ్రంథాన్ని ఆవిష్కరించిన కమిషనర్ సత్యనారాయణ, కె.ఎస్ రామరావు

రెచ్చగొట్టే వీడియోలు పెడితే కఠిన చర్యలు

- విజిలెన్స్ ఎస్పీ సురేష్, డీఎస్పీ సుధాకర్‌రావు
- అల్లర్లకు ఉసిగొలుపుతూ వీడియో పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: రెచ్చగొట్టే విధంగా వీడియోలు విడుదల చేస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం విజిలెన్స్ ఎస్పీ ఏ. సురేష్ , డీఎస్పీ సుధాకర్‌రావుహెచ్చరించారు. ఆదివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. క్రిష్టియన్ పాలేనికి చెందిన జంగాల నెహేమియా ఎదుటివర్గంపై త్వరలో దాడి చేస్తానని హెచ్చరిస్తూ, అల్లర్లకు ఉసిగొల్పేలా సెల్ ఫోన్‌లో వీడియో రిలీజ్ చేశాడని తెలిపారు. విషయాన్ని తీవ్రంగా పరిగణించి కేసు నమోదు చేశామని చెప్పారు. ఘర్షణలకు దారితీసే వీడియోలు రూపొందించినా, ప్రోత్సహించినా అటువంటి వారిపై చట్ట ఉల్లంఘన కింద కఠిన చర్యలు తీసుకొని శిక్షిస్తామని హెచ్చరించారు. పరారీలో ఉన్న నెహేమియాను త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో హింసాత్మక సంఘటనలకు సంబంధించి సబ్ డివిజన్‌లో 34 కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. టూటౌన్ పరిధిలో పోలింగ్ రోజు నమోదైన ఐదు కేసుల్లో ఇప్పటికే 87 మందిని గుర్తించామని, మరో 30 మందిని గుర్తించాలని తెలిపారు. ఎన్నికల కేసులు సక్రమంగా దర్యాప్తు చేసేందుకు పల్నాడు జిల్లాకు 15 మంది సీఐలను కేటాయించారన్నారు. వారిపై పర్యవేక్షణకు ఎనిమిది మంది డీఎస్పీ నుంచి ఏఎస్‌పీ స్థాయి అధికారుల్ని నియమించారని తెలిపారు. సమావేశంలో టూటౌన్ సీఐ భాస్కర్, ఎస్‌ఐ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజిలెన్స్ ఎస్పీ సురేష్, డీఎస్పీ సుధాకర్‌రావు, సీఐ భాస్కర్